# తల్లి లేని లోపం

'ఇటువంటి గొప్ప లోపము లన్నిటినీ జయింపగల్గిన అతని హృదయం నేడు తనకేదో గొప్పలోటు వాటిల్లినట్లుగా బాధపడుతోంది. తల్లివల్ల యీ పదిహేను సంవత్సరాలనుంచీ అతడు పొందిన సహాయమూ లేదు. ఆమె లేనందువల్ల అతనికి అలవాటైపోయిన జీవనంలో ఇకముందు మార్పూ వుండదు. కాని అతనికిమాత్రం ఆవిడలేని తనజీవితం కప్పులేని యింటి మోస్తరుగా తోస్తోంది.'

రచయిత:

## జనస్వామి కోదండరామశాస్త్రి.

'అయ్యా? మీ ముసలమ్మగారు కాలంచేసింది.'

'ఎప్పుడూ?' వులికిపడుతూ.

'ఓగంటక్రితం.'

ఎదురుగా కూర్చొని ఏదో కేసువిషయం మాట్లాడుతోన్న పార్టీలతో రేపటివుదయాన కన్పించమని చెప్పి, భుజంపై వేలాడుతోన్న తువ్వాలగుడ్డతోనే, నడుముకు చుట్టివున్న గూడకట్టుతోనే, లేచి వెంటనే బయల్దేరాడు వకీలు విశ్వనాథం.

వకీలునిచూచి శవంచుట్టూ మూగివున్న మనుష్యుల ప్రక్కలకు తప్పుకున్నారు. సరాసరి తల్లికాళ్ళ ముందుకు వెళ్ళి నిలబడి జీవంలేని ఆముడతలముఖంలోకి చూస్తోన్నాడు అదే తీరుగా.

జీవితపు అంతిమదశలో కృతార్థత చెందిన ధన్యజీవి ఆమె. తలకు కొంచెం వెనుకగా ఓచిన్ని ప్రమిదలో ఆముదపుదీపం మిణుకు మిణుకు మంటోంది. గుండెలమీదుగా రుద్రాక్షమాల ఓప్రక్కకు జారివుండి. సూర్యుని వెలుగుల్లో ముడతలు తేరిన ఆకుంద్రని ముఖం బంగారుదిమ్మవలె నిగనిగలాడుతోంది. ఆ పెదవులపై సహజమైన చిరునవ్వు మాసిపోనేలేదు. ఆముఖంలోని కాంతి తొలిగిపోనేలేదు. ఒక్క అంతరాత్మ మాత్రమే ఎగిరిపోయింది.

అరవై సంవత్సరములనుంచీ ఆ బొందిలో తలదాచుకుంటూ, ఆ నీడలో పక్కపర్చుకుని పడుకుంటూ, ఆమాంసపు గృహంలోని నరాల గోడల్ని పాడుచేసే ఘోరజాడ్యాల గొడ్డళ్ళతో తీవ్రంగా పోరాడుతూ......బాధా, వ్యధా, చింతా మొదలైన ప్రపంచకష్టాలతో మరగిపోతూ, దయా, జాలీ, పరోపకారమూ, వీటితో కరిగిపోతూ——...ఒకదశలో 'యీ జగత్తుసుఖాలగని. పుష్పవనం' అనే మోహభావంతోనూ ... ఇంకోదశలో 'యీ ప్రపంచంల్లో ఏముందీ! కష్టాలూ, దుఃఖాలూ, వ్యధలూతప్ప. ఛీ వెధవప్రపంచం 'అనే జుగుప్సాభావంతోనూ ... మరోదశలో 'ఇంతటితో నా జీవితం ముగిస్తే బాగుండు' అనే విరక్తిభావంతోనూ ... 'ఓభగవంతుడా? దయామయుడా? నీ నామాక్షరములు నాహృదయఫలకనుంతా నిండివున్నాయి. యీతుచ్ఛ ప్రపంచంల్లో నన్ను తీసుకొని వెళ్ళి నీ పాదపద్మములవద్దకు చేర్చుకో' అనే భక్తిభావంతోనూ తహతహలాడుతూ కాలక్షేపం చేస్తోన్న ఆ అంతరాత్మ, గోడలన్నీ ఒంగిపోయి, చెదలుపట్టి, మరమ్మతులకుకూడా వంగని ఆ శిథిలమాంసగృహాన్నివిడిచి, నిర్మలమైన పవిత్ర ఆకాశవాహినిలోగుండా దూసుకుని పోయింది.

భర్తృదాస్యం...ప్రభుత్వదా

స్యం... సాంఘిక దాస్యం ... సంతాన దాస్యం... యీవిధంగా అనేక తరహాల దాస్యబంధనాల్లో నలిగినలిగి...వలపుల వెన్నెలలో, యౌవనశోభలో, ప్రణయమధురిమలో సుఖకాంతను దర్శించి ఆనందంతో పొంగిపొంగి........చంచల ధనలక్ష్మి వికటాట్టహాసనృత్యములతో విసిగి విసిగి......సుఖాల చిలిపినవ్వులకు ఆనందపరవశత్వం చెందుతూ...కష్టాల కరకర మంటలతో కాలిపోతూ...... ఇంతకాలము నుంచీ భూలోకనివాసిని అనిపించుకుంటోన్న ఆ మానవజీవి నేడు జనసంఖ్యచిట్టాలో పరలోకవాసినిగా లెక్కింపబడ్డది. ఆ పవిత్రాత్మ స్వేచ్ఛావిహారిణియై, పుష్పరథాసీనురాలై, దేవలోకాల్లో వూరేగిపోయింది. నిష్కపటమైన, నిజమైన ఆనందమును సాధించుటకై సుందరలోకాలు దర్శించడానికని, దేవుని అనుజ్ఞాపత్రం ఆమె కండ్లముందు వాలింది. వకీలు కండ్లనుండి నీటిబొట్లు జలజలా రాలాయి.

* * *

అసలా తల్లీ కొడుకులమధ్య విరోధం తలఎత్తడానికి కారణం అతనిభార్య. ఆమె అతని హృదయాన్ని 'తల్లి' అంటే ఎంతోకక్షగావుండేలాగు మార్చింది. ఆమె మరణించి నాలుగుసంవత్సరములు కావస్తున్నా, ఆమె కల్పించిన కక్ష కాలక్రమేపీ పెరుగుతూవచ్చిందే కాని, దాన్నిమాత్రం ఏమృత్యువూ మింగలేదు. భార్య బ్రతికివున్నరోజుల్లోనే విశ్వనాథం మనోవర్తికని తల్లికి కొంతపైక మిచ్చాడు. ఆపైకంలో కొంతపెట్టి ఆవిడ వూరిబయట ఒక ఖాళీ స్థలంకొని, దాంట్లో ఒక చిన్న పూరి వసారా వేసుకుని అందులో నివశిస్తూండేది.

కడుపార కన్నకొడుక్కి తను ఎంతదూరమైపోయిందీ? వాడినివాసం వూరి మొదట్లో, తన నివాసం వూరి చివర. అనగా మైలుదూరం ఎడమన్నమాట... బి. ఏ. చదివే రోజుల్లోకూడా వాడు తనపట్ల ఎంత భక్తిగా, ఎంత ప్రేమగా వుండేవాడూ? 'అమ్మా నువ్వు నాకోసరం చాలా కష్టపడుతున్నావు. నన్ను దైవం రక్షిస్తే తప్పకుండా సుఖపడతావ్' అని వాడప్పుడన్న మాటలు తనమదిలో మిలమిలా మెరుస్తున్నయ్యే? దైవంవాణ్ణి రక్షించాడు. తనశ్రమ వృథా పోలేదు. ఫలితంలోకి వచ్చింది. కాని తను అనుభవించేయోగం లేదు. పాతికేళ్ళవయసులో కూడా తను కళ్లురిమిచూస్తే హడలిపోయేవాడు. లేకపోతే యీకాలపు పిల్లకాయల్లాగా సిగిరెట్లూ, సినీమాలూ, అల్లరిచిల్లరివిషయాలూ, ఆకతాయతనంగా తిరగడమూవుంటే, అట్టి విషమపరిస్థితుల్లోనుంచి తెప్పరిల్లుకుని వాడిని ఇంత వృద్ధిలోనికి తేగలిగివుండేదా? ఆమనోరమ మధ్యలోనేవచ్చి మధ్యలోనే పోయింది. కాని చేసిన ఘనకార్యం మాత్రం స్థిరంగా నిల్చిపోయింది.

స్వహస్తములతో నింపుకున్న అమృతపాత్ర తనకు అనుభవనీయముకాలేదు. దుర్విధి అడ్డుతగిలింది. పోనీ దూరంగా చూచి అయినా తను సంతోషిస్తుంది. ఎంత శ్రమకోర్చి ఎన్నికష్టాలు పడి, నిరాశాసమయాల్లో కూలిపోకుండా, ఎంత సమర్థతతో ప్రవర్తించి ఆ అమృతపాత్రను అంత అందంగా చెయ్యగలిగిందో తనకే తెలుసు!

మనోరమ గతించినతర్వాత తన పుత్రుని గృహంలో ప్రవేశిద్దామని ఆశించింది ఆవిడ. ప్రయత్నించింది. కాని అతను సాగనిచ్చాడుకాడు.

అతను బజారువెంబడి నడిచి వెళుతూంటే సందుల మలుపుల్లో చాటుగా నిల్చుని అదే తీరుగా చూస్తూండేది. ఆనల్లకోటూ, కుదురైన తలపాగా, చేతిలో లాపుస్తకాలూ, ఆరాజఠీవి—ఆమాతృదేవి నేత్రముల్లో ఆనందబాష్పము లొలుకుతూండేవి.

'దైవమా! ఇంతమాత్రపు సంతోషాన్నయినా, నాజీవితంలో నిలుపు.' అని పరమేశ్వరుడిని ప్రార్థించుకునేది మనసులో.

తల్లీ కొడుకు లిద్దరూ గబగబా అరుస్తూ పోట్లాడుకునేవారు. నువ్వెంత అంటే, నువ్వెంత అనుకునే

వాళ్లు. అప్పటి తాత్కాలిక పరిస్థితులు ఆహృదయాలు రెంటినీ ఇనుపశిలలుగా మార్చేవి.—కోపం, రోషం, పౌరుషం, వీటిలో అటువంటి నడతలు వుంటాయి. హృదయములో చీమంత కల్మషమైనా వుండేది కాదు. కంఠస్వరములోని కరకుదనం మాత్రమే. ఆనాలుగు దుష్టనిముసములూ గడచిపోయి నాక ఏవేవో అద్భుతశక్తులు వారి హృదంతములో ధ్వనించేవి 'నీవు పుత్రుడివి. ఆమె పూజ్యనీయమైన నీతల్లి.'

'వాడు ప్రేమాస్పదుడైన నీ పుత్రుడు. నీకు పరలోకములో పున్నామనరకమును తప్పించుట కవతరించిన మధురమూర్తి.'

ఇద్దరిహృదయాల్నీ పశ్చాత్తాపమూ, విచారము క్రమ్మివేయగానే 'అయ్యో! మా అమ్మను అంత నీచంగా మాట్లాడానా!' అని కొడుకూ—

'ఇదేమిటి? వాళ్లు తెలియకుండా వాడిని అట్లామాట్లాడానే?' అని తల్లీ—ఎంతోసేపు బాధపడేవాళ్లు. అప్పుడప్పుడు అతని ఇంటికి వెళుతూండేది. ఆఫీసుగదిలో అతను ఒంటరిగా కన్పించడమే దుర్లభం. ఎంతోసేపు బయటి అరుగుల పై మలమలలాడుతోన్న ఎర్రని ఎండలో నిల్చొనివుంటేగాని అవకాశం చిక్కేది కాదు. కిటికీసందుల్లోనుంచి తొంగిచూచి మరి యితరు లెవరూలేరని తెల్సుకుని మెల్లిగానడుస్తూ లోపలకు వెళ్ళేది.

'నాయనా విశ్వం? మళ్ళీ వివాహం చేసుకో. నీకు వయస్సేమంత ముదర్లేదు.'

'ఇక చాల్లేవమ్మా నీ వుపన్యాసం కట్టిపెట్టు.'

మరొకతడవ—

'విశ్వం? నామాటవినవూ?'

'కాటికి కాళ్లుచాచుకుని కూర్చున్న నాకు పెళ్లేందుకమ్మా?'

ఈమాట ఆతల్లి హృదయంలో శూలమై గ్రుచ్చుకుంది.

ఇంకోతడవ—

'నాయనా? పెళ్ళిచేసుకో నువ్వు కొడుకుని ఎత్తుకుని ఆడిస్తోండగా నాకు చూడాలనివుంది.'

'అంతేనా? లేకపోతే వయసు భార్య నన్ను అల్లరిపెడుతోంటే చూడాలనివుందా?' అని జవాబు.

ఆమె మనసు చివుక్కుమనడం, అంతటితో మారుమాట్లాడకుండా తలవంచుకుని వెళ్ళిపోవడమూ జరిగింది.

అతని ఒంటరి జీవితాన్ని తల్చుకుని ఎప్పుడూ దిగులుపడుతూ వుండేది. ఆవిడ మనసు ఆగక, పెళ్ళి సమ్మంధాలు ఏవైనా మాట్లాడుకొస్తే 'స్వేచ్ఛగావున్న నాకు మెడ చుట్టూ విషపురుగులను చుట్టాలని ప్రయత్నిస్తున్నావా?' అని ఎగిరిపడేవాడు ఆగ్రహంతో.

* * *

విశ్వనాథం తల్లిశవాన్ని దహన పర్చి ఇంటికివచ్చాడు. ఆఇల్లూ, ఆ వూరూకూడా తన హృదయంవలెనే భోరుమంటోన్నట్లు తోచింది. భార్యమరణించినప్పుడూ అతని మనసు ఏమాత్రమూ చలింపలేదు. చేతికందొచ్చిన యిద్దరు బిడ్డల్నీ ఒకేతడవ అకాలమరణం క్రమింగేసినప్పుడూ అతని హృదయం ఇంతగా క్షోభింపలేదు. అతని ఒంటరి జీవితాన్ని చూచి ఇతరులు జాలిపడేవారుగాని అతనికి ఏమాత్రమూ విచారముండేది కాదు. నలభై సంవత్సరముల జీవితం గడచిపోయినప్పటికీ, ఆ యీడు పొందాల్సిన సంతోషం అతనికి లభింపలేదు, ఇంట్లో అడుగుపెడితే పలకరించే దిక్కులేదు. ఆదరించే ఆప్తులు లేరు. ఆభవనములో ఎల్లప్పుడూ విసుగూ విరామంలేకుండా విహరించే నిశ్శబ్దతే అతనికి ఆప్తమిత్రుడు.

అమిత బాధాకరములైన యీ లోపాలు అతని జీవితాన్ని ఎన్నో సంవత్సరముల క్రితమునుంచే ఆవరించి వున్నప్పటికీ, వాటికి ఏమాత్రమూ అతను లొంగిపోలేదు. అవ్వే అతని హృదయగాంభీర్యానికి భీతిల్లి అతని పాదముల అడుగున అణగి పడివున్నాయి.

ఇటువంటి గొప్ప లోపములన్నిటినీ జయింపగల్గిన అతని హృదయం నేడు తనకేదో గొప్పలోటు వాటిల్లినట్లుగా బాధ పడుతోంది. తల్లివల్ల ఈపదిహేను సంవత్సరాల నుంచీ అతడు పొందిన సహాయ

మూ లేదు. ఆమె లేనందువల్ల అతనికి అలవాటైపోయిన జీవనంలో యికముందు మార్పు వుండదు. కాని అతనికిమాత్రం ఆవిడ లేని తన జీవితం కప్పులేని యింటిమోస్తరుగా తోస్తోంది.

తన సామీప్యంలో కాకపోయినప్పటికీ కొంచెందూరంగా నైనా తన జీవితానికి ఒక 'నీడ' అంటూ వుండేదనీ, తనకు తెలియకుండానే అవసరమైనపుడు తనపై వాలి చల్లని పిల్లవాయువుల్ని ప్రసాదిస్తూం డేదనీ, ఇప్పుడు అంత సౌఖ్యకరమైన ఆనీడ కాస్తా ఎండలో కలిసిపోయిందనీ—ఆదురదృష్టజీవి కుమిలిపోతున్నాడు.

తల్లి పెంపకపు రోజుల్లోని మధురక్షణాలు అతని ఊహాపథంలో మెరశాయి. అతని హృదయం తన ప్రస్తుత జీవితాన్ని, ఆవిలువగల క్షణాలతో పోల్చి చూసుకుంటోంది.

అతని మనసులో అశాంతి ప్రబలింది. శరీరంఅంతా కారంరాచినట్లుగా మంటలు. ఆ దివ్యభవనం పాకీదొడ్డికంటెకూడా ఎక్కువ దుర్గంధపూరితంగా తోస్తోంది.

లేచి నిలబడి బయటికొచ్చాడు. ఎక్కడికెళ్లాలనీ స్థిరపర్చుకోకుండానే నడవ నారంభించాడు.

అతని కాళ్లు సరీగ్గా శ్మశానభూమిలో అతని తల్లిని దహనపర్చిన చోటున ఆగినై.

ఆభస్మం అట్లాగేవుంది. గాలికి చిటికెడైనా ప్రక్కలకు చెదర్లేదు. ఆవిధంగా భస్మం ఓగజంపొడుగున వ్యాపించివుంది. కూర్చొని రెప్పవాల్చకుండా చూస్తోన్నాడు. అతని కళ్ళకొలుకులలోనుంచి జారిపడుతో అశ్రుకణాలలో తడుస్తోంది ఆ భస్మం—

సంధ్యచీకట్లు బాజాలు వాయించుకుంటూ అతన్ని చుట్టేస్తోన్నాయి. దూరంగా చెట్లగుంపులోనుంచి పెద్దగా అరుచుకుంటూ నక్కలు పరుగెత్తుకుంటూరావడం అతను గమనించడమే లేదు.

పండితులకుమాత్రమే

# వాత్స్యాయన కామసూత్రములు

యశోధరుని జయమంగళ వ్యాఖ్యయు, మూలసూత్రములును తేటతెల్లమగు ఆంధ్రవివరణము, విశేషాంశములు, పీఠికతో సహా శ్రీ పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారిచే కూర్పబడిన పెద్దసైజున 800 పుటలుగల గ్రంథము- కామపురుషార్థమును గురించిన అన్ని సంగతులు గలవు.

## రెండవ కూర్పు – రు 10–0–0 – పోస్టుఖర్చులు ప్రత్యేకము.

గ్రంథము విలువయును, యోగ్యతయును ఆంధ్రదేశమునందలి ప్రతియొక్కరును ఎఱింగియుండుటచేతను దీనిని గుఱించి విశేషించి వ్రాయనవసర ముండదు. విద్వాంసులు, భాషాపారిశ్రామికులు, చారిత్రికాన్వేషణము చేయు సజ్జనులు తప్ప ఇతరుల కెవ్వరికిని ఎంతమూల్యము నొసంగినను ఈ గ్రంథమును విక్రయించుటగాని, మఱి ఇతరవిధములగాని ఈయము. గ్రంథమును చక్కగా సంరక్షించుకొని దుర్వినియోగమునకుఁ దావీయమని వ్రాతమూలకముగా పూచీనిచ్చువారు మాత్రమే ఈగ్రంథము కొఱకై ఆర్డరులను పంపవలెను. పాఠశాలలు, కళాశాలలు మొదలైనవాటిలో చదువు విద్యార్థులును; స్త్రీలును; గ్రంథమునుగాని, గ్రంథస్థములగు విషయములనుగాని సంరక్షణచేసికోఁజాలని ఇతరులును ఈ గ్రంథమునకు ఆర్డర్లు పంపవలదు.

## ఆంధ్రభూమి బుక్కుడిపో, వేపేరి, మదరాసు.